మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్రబోయి, మున్సిపల్ ఛైర్మన్

## వీర వనిత చాకలి ఐలమ్మ : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రిబోయితో కలిసి గ్రీన్ బెల్టులో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** బడుగు బలహీన వర్గాల వారిని నిజాం నిరంకుశ పాలకులు ఏ విధంగా హింసించారో తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా ప్రపంచానికి తెలియజేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్టులో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య లాంటి అమరవీరులు స్ఫూర్తిని ఇచ్చారని, వారి స్ఫూర్తితోనే సబ్బండ వర్ణాలు తెలంగాణ కోసం సమ్మె చేస్తే ఢిల్లీ దిగొచ్చి తెలంగాణ ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ మహిళలు, ఆడబిడ్డలకు చాకలి ఐలమ్మ చరిత్రను పాఠ్య పుస్తకాలలో భద్రపరచుకుని అందరికి అందించాలల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఆడపిల్లల చదువు, ఉద్యోగాలు, వారి భద్రతపై ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగానే ఆడపిల్లల విద్య, వైద్యంపై నూతన ప్రభుత్వం దృష్టి సారించిందని, చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో అందరం కలిసి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారిని ఇందిర, జిల్లా రజక సంఘం గౌరవాధ్యక్షులు నర్సింహులు, పురుషోత్తం, మల్లేష్, దుర్గేష్, పాండు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# కన్నీటి వీడ్కోలు..



- అశ్రునయనాల మధ్య మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి అంత్యక్రియలు
- సంతాపం ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి
- అంతిమయాత్రలో పాల్గొన్న హరీశ్‌రావు, మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు
- పార్థీవ దేహానికి నివాళులర్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యేలు,ఎంపీలు
- శోకసంద్రంలో ఆవంచ

**మహబూబ్‌నగర్ బ్యూరో,నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** జడ్చర్ల శోకసంద్రంలో నిండింది. బీఆర్ఎస్ శ్రేణులు విషన్నవదనంలో మునిగిపోయారు. మాజీ మంత్రి సీ లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారన్న విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. కొన్ని రోజులుగా అనారోగ్యసమస్యలతో బాధపడుతున్న ఆమె చెన్నైలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ప్రాణాలతో పోరాడుతూ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. మంగళవారం చెన్నై నుంచి ఆమె పార్థీవదేహాన్ని ప్రత్యేక వాహనంలో జడ్చర్ల మీదుగా వారి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా ఆవంచకు తీసుకొచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. అశేషజనవాహిని మధ్య సాయంత్రం శ్వేతారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నేతలతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ రాజకీయపార్టీల నేతలు, అభిమానులు తరలిరావడంతో ఆవంచ కన్నీటి సంద్రమైంది.

**దారులన్నీ ఆవంచకే..**

శ్వేతాలక్ష్మారెడ్డి మరణవార్త తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వేలాదిగా ఆవంచకు తరలి వచ్చారు. దీంతోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి నేతలు, రాజకీయ ప్రముఖులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు భారీ ఎత్తున తరలిరావడంతో ఆవంచ శోకసంద్రంలో నిండిపోయింది. గ్రామంలో ఎక్కడా చూసినా విషాదఛాయలే అలుముకున్నాయి. లక్ష్మారెడ్డి రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు, ఎన్నో ఉన్నత స్థానాలకు అధిరోహించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర మంత్రివర్గంలో కూడా పని చేయడంతో రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఆయన శ్రేయోభిలాషులు తరలివచ్చి శ్వేత పార్థీవదేహానికి నివాళులర్పించి లక్ష్మారెడ్డికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దీంతో జడ్చర్ల నుంచి ఆవంచకు వాహనాల రద్దీ నెలకొన్నది. అంతిమయాత్రకు వేలాదిగా తరలిరావడంతో కొంత ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

**సీఎం, మాజీ సీఎం సంతాపం**

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత అకాల మరణం చెందడం చాలా బాధాకరమని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అదేవిధంగా బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ లక్ష్మారెడ్డికి తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. శ్వేత పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనకు భగవంతుడు మనోధైర్యం అందించాలని ఆ భగవంతుడిని ప్రార్థిన్నట్లు తెలిపారు.

- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు శ్వేతారెడ్డి పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు పద్మజారెడ్డి, నియోజకవర్గ నాయకురాలు బాలాత్రిపుర సుందరి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు శ్వేత పార్థీవదేహం వద్ద నివాళులర్పించారు.

**లక్ష్మారెడ్డిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు..**

లక్ష్మారెడ్డి కుటుంబంలో శ్వేతారెడ్డికి ఓ ప్రత్యేక స్థానం ఉన్నది. వారు ఆమెకు అంత ప్రాధాన్యత ఇస్తారు. కుటుంబానికి ఆమె బలం. పార్టీ కార్యకర్తలు సైతం ఆమెను అమ్మా అంటూ సంబోధిస్తారు. దీంతో ఆమ్మను కోల్పోయా మంటూ కార్యకర్తలు, నాయకులు బోరున విలపించారు. ఇదిలా ఉండగా లక్ష్మారెడ్డిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి హరీశ్‌రావును చూసిన వెంటనే లక్ష్మారెడ్డి కంట్లో కన్నీళ్లు ఆగలేదు. హరీశ్‌రావును పట్టుకొని బోరున విలపించారు. లక్ష్మారెడ్డిని ఓదారుస్తూ ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని మనోధైర్యం నింపా రు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వ ర్‌రెడ్డి శ్వేతా అంత్యక్రియల పూర్తయ్యే వరకు లక్ష్మారెడ్డి వెంటే ఉన్నారు. చిన్నపిల్లాడిలా ఏడు స్తూ కూర్చున్న లక్ష్మారెడ్డిని చూసిన కుటుంబ సభ్యులు, ఉమ్మడి జిల్లా నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, అందరూ కలుస్తూ సానుభూతి ప్రకటిస్తూ ధైర్యం చెప్పారు.

**లక్ష్మారెడ్డిని ఓదార్చిన హరీష్‌రావు, నేతలు**

నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం, ఆవంచ గ్రామానికి చేరుకుని, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావుతో పాటు సీనియర్ నేతలు ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధలో ఉన్న లక్ష్మారెడ్డికి ధైర్యం చెప్పి ఒదర్చారు. శ్వేతారెడ్డి పార్థీవదేహానికి నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సతీమణి జమున, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సతీమణి అమల, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, సురెందర్, జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, రాజేందర్‌రెడ్డి, కార్పోరేషన్ మాజీ ఛైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, రజిని సాయిచంద్, ఇంతియాజ్ ఉన్నారు.



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం, అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీ డీకే అరుణ



అంతిమయాత్రలో పాల్గొన్న అశేషజనం



## 106 ఎకరాలు అన్యాక్రాంతం

**బూరెడ్డిపల్లి భూ అక్రమాల నిగ్గు తేల్చండి**

**సర్వే నంబర్ 149లో అక్రమాలపై చర్యలు తీసుకోండి**

**జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి లేఖ**



**జడ్చర్ల,సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** మండలంలోని బూరెడ్డిపల్లి భూముల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. ఆ ప్రాంతంలోని రెండు సర్వే నంబర్లలో వందల కోట్ల విలువైన 106 ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా వాటిని అక్రమ మార్గాల్లో దక్కించుకోవడానికి కొంతమంది చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిరబోయికి లేఖ రాశారు. బూరెడ్డిపల్లిలోని సర్వేనంబర్ 117లో ఉన్న 45.02 ఎకరాల భూములను కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఇప్పటికే కొంత మేరకు అ న్యాక్రాంతం చేశారని, అసలు సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి ప్రభుత్వ భూములను కూడా రిజిస్టర్ చేసుకున్నారని తన దృష్టికి వచ్చిందని చెప్పారు ప్రభుత్వ భూములను ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న పేదలను దళారీలు బెదిరిస్తున్నారని, ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కూడా తనకు తెలిసిందన్నారు. ఈ భూముల్లో జరుగుతున్న అక్రమాలపై పత్రికల్లో కూడా కథనాలు వస్తున్నాయన్నారు. మార్కెట్లో ఎకరా సుమారు రూ.6కోట్లకు పైగా పలుకుతున్న ఈ ప్రభుత్వ భూముల విలువ రూ.600 కోట్లకు పైగా ఉంటుందని, ఈ భూములను వివిధ మార్గాల్లో కాజేయడానికి -మిగతా3లో..

## ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

**జ్వరం లక్షణాలతో వచ్చే వారందరికీ రక్త నమునాలు సేకరించి ఎలిజా పరీక్షలను పంపించాలి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**గోపాల్‌పేట సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** ప్రతి గర్భిణిని గుర్తించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం జరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం గోపాల పేట మండలంలో పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ.డి.డి, ఏ.ఎన్.సి రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ గోపాల్‌పేట మండలంలో ఉన్న మొత్తం గ్రామాలు,జనాభా ప్రతి నెల సుమారు ఎంతమంది గర్భిణిలు ప్రసవం చేస్తారు వంటి వివరాలను రాబట్టారు. మండలంలోని ప్రతి గర్భిణిని మొదటి త్రైమాసికంలోనే గుర్తించి క్రమం తప్పకుండా వైద్య పరిక్షలు నిర్వహిస్తూ ప్రైవేటు ఆసుపత్రికి కాకుండా ప్రభుత్వాసుపత్రిలోనే సాధారణ ప్రసవం జరిపించే విధంగా చూడాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అదేవిధంగా మండల పరిధిలో డెంగ్యూ,చికెన్ గున్యా,మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం లక్షణాలతో వచ్చే రోగులకు రక్త నమూనాలు సేకరించి ఎలిజా పరీక్షలకు పంపించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన మహిళలతో మాట్లాడారు. అనంతరం గోపాల్‌పేట పాత తహశీల్దార్ కార్యాలయం భవనాన్ని పరిశీలించారు. కొంత మరమ్మత్తులు చేయించి స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థకు ఇస్తే ఎలా ఉంటుందని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్,గోపాల్‌పేట తహశీల్దార్ తిలక్,మెడికల్ ఆఫీసర్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



పాత తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

## సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్టుగా కొండారెడ్డిపల్లి

- కొండారెడ్డిపల్లి గ్రామాన్ని సోలార్ విద్యుత్ గ్రామంగా మార్చాలి...
- విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మొక్కలు నాటిన సీఎండీ ముషరఫ్ అలీ ఫరుఖీ, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న సీఎండీ ముషరఫ్ అలీ ఫరుఖీ, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌లు



గ్రామ మహిళా జ్యోతి సభ్యురాలు లక్ష్మమ్మతో మాట్లాడుతున్న సీఎండీ ముషరఫ్ అలీ ఫరుఖీ, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌లు

**వంగూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ నెలకొల్పి గృహ, వాణిజ్య, విద్యుత్ అవసరాలతో పాటు రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు అందించాలనే ప్రణాళిక రూపొందించనున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ ముషరఫ్ అలీ ఫరుఖీ తెలిపారు. మంగళవారం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టును రైతులు, ప్రజలకు తెలియజేసేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, సీఎండీ ముషరఫ్ అలీ ఫరుఖీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులతో కలిసి సీఎండీ ముషరఫ్ అలీ ఫరుఖీ కొండారెడ్డిపల్లి పైలెట్ ప్రాజెక్టు చేపట్టేందుకు అవసరమైన కార్యచరణ ప్రణాళికను అధికారులు, గ్రామస్తులతో చర్చించారు. గ్రామస్తులు సౌర విద్యుత్‌కు సంబంధించిన సందేహాలను సీఎండీ ముషరఫ్ అలీ ఫరుఖీ, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ల దృష్టికి తీసుకొని రావడంతో వారి సందేహాలను నివృత్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని సోలార్ విద్యుత్‌ను వినియోగించుకునే ప్రయత న్ంలో భాగంగా సోలార్ విద్యుకు మార్చే ప్రయత్నంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద రెండు గ్రామాలను ఎంపిక చేశారని, అందులో సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి, మరోకటి ఖమ్మం జిల్లాలో గుర్తించినట్లు తెలిపారు. వారం రోజుల పాటు సోలార్ విద్యుత్‌కు సంబంధించిన బృందాలు పర్యటిస్తారని, రైతులను, ప్రజలను, వ్యాపారస్థులను కలిసి వారి యొక్క అభిప్రాయాలను సేకరించనున్నట్లు గ్రామస్తులు సహకరించాలని కోరారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయడం కోసం అధ్యయన బృందాలు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పిస్తారని తెలిపారు.

**సోలార్ విద్యుద్దీకరణగా మారనున్న కొండారెడ్డిపల్లి**

**-జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటు చేయనున్న సోలార్ విద్యుత్ ద్వారా గ్రామంలోని ప్రతి ఇల్లు, వ్యవసాయ పొలాలు వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే విద్యుత్ సరఫరాను సోలార్ ద్వారా వినియోగించేలా ప్రథమంగా కొండారెడ్డిపల్లిలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో రైతులకు విద్యుత్ సమస్యలు ఎదురు కాకుండా చూడవచ్చునని, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను పొందవచ్చునన్నారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేయడంలో గ్రామంలో ప్రతి ఒక్కరికి ఈ అంశంపై పూర్తి అవగాహన కల్పిం చనున్నట్లు ఆయన తెలిపారు. అనంత రం కొండారెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ సీఎండీ, జిల్లా కలెక్టర్‌లు పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి సోలార్ విద్యుత్ వినియోగించడం -మిగతా3లో..



## నాటుసారాను అరికడతాం

**కృష్ణ, నందిన్నె చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాం**

**దూల్‌పేటలో 100% గంజాయిని అరికట్టాం**

**ఇతర జిల్లాలతో పోలిస్తే డ్రగ్స్ వినియోగం మహబూబ్‌నగర్ జిల్లాలో తక్కువ**

**మీడియా సమావేశంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్‌రెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న వివి కమలహాసన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎక్సైజ్ సిబ్బంది పనితీరు సంతృప్తిగా ఉందని, నాటుసారాను పూర్తిగా అరికట్టాలని డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలహాసన్‌రెడ్డి సిబ్బందికి సూచించినట్లు మీడియా సమావేశంలో తెలిపారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటుసారా, కల్తీ కల్లు సేవించడం వల్ల అనారోగ్య పాలవుతున్న కుటుంబాలు ఈ జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్నారని, వాటిని పూర్తిగా కంట్రోల్ చేయడానికి ఎక్సైజ్ యంత్రాంగం అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా అడ్డుకోవడానికి కృష్ణ, నందిన్నె చెక్ పోస్టులో నిఘా పెంచామని, ఇతర జిల్లాలతో పోలిస్తే మహబూబ్‌నగర్ జిల్లాలో డ్రగ్స్ పూర్తి స్థాయిలో కంట్రోల్‌లో ఉన్నాయని, నాటుసారా సైతం రెండు జిల్లాల్లో ఈ రెండు మూడు నెలల్లో పూర్తిగా నాటుసారాను అరికట్టడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. నాటుసారాను డ్రగ్స్‌ను అరికట్టడానికి కొత్తగా జిల్లాలో పోలీసులతో కలిసి అనేక దాడులు నిర్వహించడానికి ప్రణాళికలు చేపట్టామని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో దూల్పేట్‌లో గంజాయికి అడ్డాగా ఉన్నటువంటి ప్రాంతంలో గతనెల రోజులుగా దాడులు నిర్వహిస్తూ గంజాయిని పూర్తిగా అరికట్టామని చాలామందిని జైల్లో పపించామని అన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులతో నిర్వహించిన -మిగతా3లో..

## సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ

**ఐలమ్మ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ బహుజన ఆత్మ గౌరవానికి ప్రతీక అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. మంగళవారం ఐలమ్మ వర్థంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. భూమి, భుక్తికోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయని అన్నారు. తెలంగాణ మట్టిలోనే పోరాటతత్వముందని చెప్పడానికి ఐలమ్మ జీవితమే నిదర్శనమని చెప్పారు. భవిష్యత్ తరాలకు ఐలమ్మ గురించి తెలియజేసేందుకు జిల్లా కేంద్రంలో విగ్రహం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ నర్సింహులు, ముడా మాజీ ఛైర్మన్ వెంకన్న, కౌన్సిలర్‌లు గణేష్, రాము, పట్టణ అధ్యక్షులు శివరాజ్, సీనియర్ లీడర్లు నవకాంత్, పాల సతీష్, చిట్యాల సుధాకర్, కిషన్ పవర్ తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్

## ఉపాధి కల్పన కోసం జాబ్ మేళా నిర్వహణ....!

**గద్వాల, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయము ఆధ్వర్యంలో డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్ గద్వాల సహకారంతో ఈ నెల 12న బీసీ స్టడీ సర్కిల్, గద్వాల నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్ప అధికారిని డా. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కెఎల్ గ్రూప్, వినూత్న ఫర్టిలైజర్స్, ప్రథం ఫౌండేషన్ వారు తమకు అవసరమైన అభ్యర్థులను జాబ్ మేళా ద్వారా ఎన్నుకోనున్నారని ఆమె తెలిపారు. కనీసం పదవ తరగతి అర్హత గల జిల్లా నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జాబ్ మేళాను వినియోగించుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి డా. ప్రియాంక్ కోరారు. ఇతర వివరాలకు90304213360,6303430789,9505904444 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## ఆశా వర్కర్లకు కనీస వేతనం అందించాలి

**మక్తల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** గ్రామీణ, పట్టణం అనే తేడా లేకుండా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి విశేష రీతిలో వైద్యసేవలు అందేందుకు కృషి చేస్తున్న ఆశా వర్కర్లను తక్షణమే కార్మికులుగా గుర్తించి, వారికి రూ. 26 వేల కనీస వేతనం అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి, మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్‌రాజ్,ఆశయూనియన్ పిహెచ్‌సి అధ్యక్షులు గోవిందమ్మ, ఇందిరమ్మ, యశోద, అనిత, అమీనబేగం, రసీదబేగం, సావిత్రమ్మ, సుజాత, వెంకటమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.




వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

## ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**కల్వకుర్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** ఈనెల 11న నిర్వహించే ఉద్యోగ మేళాను నిరుద్యోగులు యువత సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఐటీఐ ప్రిన్సిపాల్ జయమ్మ పేర్కొన్నారు. వరుణ్ మోటార్స్, విజయ బయోఫెర్టిలైజర్స్ ప్రైవేటులిమిటెడ్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలని ఆమె కోరారు. కల్వకుర్తి ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు ఆసక్తి గల నిరుద్యోగులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఉద్యోగ మేళాలో ఎంపికైన వారికి ఉమ్మడి జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయ సిబ్బంది లేదా 9701200819,9885462005లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ జయమ్మ సూచించారు.

## అదనపు గదుల నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మక్తల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరి పడా తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర వుతున్నాయని, అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ఇప్పటికే నిధులు మంజూరైనప్పటికి పనులు చేపట్టకపోవడంతో విద్యా ర్థులు తీవ్రంగా నష్ట పోతు న్నారని గ్రామస్తులు వాపో యారు. ఈమేరకు మంగళ వారం గ్రామ యువత ఆ ధ్వర్యంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. నిధులు మంజూరై రెండేళ్లు గడిచినా గుత్తేదారు పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రీటెండర్ నిర్వహిం చి తరగతి గదుల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

## సఖి సెంటర్ నిర్వహణ కోసం..

**గద్వాల, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లాలో గల సచ కేంద్రం/వన్‌స్టాప్ సెంటర్, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్దుల శాఖతో ఒక సంవత్సరం పాటు పనిచేయడానికి కో మేనేజ్‌మెంట్ అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు వెబ్‌సైట్ సందర్శించాలని, పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమగు డాక్యుమెంట్లతో కలిపి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, మహిళా, శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కలెక్టర్ కార్యాలయం ఐడిఓసి బిల్డింగ్ , రూమ్ నెంబర్ జి 33 జోగులాంబ గద్వాల 509125 వద్ద దాఖలు చేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 11 నుండి 20 వ తేది సాయంత్రం 5 గంటల వరకు అందజేయాలన్నారు. పోస్టల్ యొక్క లేదా ఏదైనా జాప్యం ఆలస్యం కాబడిన దరఖాస్తులను పరిశీలించబడవు. ఇతర సమాచారం కొరకు 9908510100,9440170160 నెంబర్లకు నేరుగా సంప్రదించగలరు అన్నారు.

## విద్యార్థులకు ఘన సన్మానం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కోటి మహిళా యూనివర్సిటీలో క్యాంపస్‌లో పీజీ సీటు సంపాదించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కళాశాల విద్యార్థిని నందిని కెమిస్ట్రీ విభాగంలో సీటు సాధించగా, బండి అనిత జీవిశాస్త్ర విభాగంలో పీజీ సీటు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తానా తెలిపారు. సీటు సాధించిన సందర్భంగా ఆయా విభాగాల హెచ్‌ఓడీలను ఇతర సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నందిని, అనితలకు పుష్పగుచ్ఛం అందజేసి విద్యార్థుల సమక్షంలో అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయులు, కోదండరాములు, ఉమాదేవి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



విద్యార్థినులను సన్మానిస్తున్న దృశ్యం

# కొండారెడ్డిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి...

**- నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

**వంగూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వివిద శాఖల అధికారులతో కలిసి కొండారెడ్డిపల్లిలో పర్యటించి వివిధ శాఖల అభివృద్ధి, నిర్మాణ పనులపై సమీక్షించారు. ప్రస్తుతం గ్రామంలో నిర్మాణమవుతున్న ప్రభుత్వ పాఠశాల, గ్రంథాలయం, పాలశీతలీకరణ కేంద్రం, గ్రామ పంచాయతీ, బీసీ కమ్యూనిటీ హాల్, పశువైద్య శాఖ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కొండారెడ్డిపల్లి గ్రామాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, శ్రీశైలం జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు, విద్యుద్దీకరణ లాంటి అభివృద్ధి పనుల పురోగతి సంబంధిత శాఖల అధికారులతో అడిగి తెలుసుకున్నారు. పనులన్నింటిని నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వంగూరు మండల కేంద్రంలో సమీకృత భవన నిర్మాణం, వంగూరు నుంచి జూపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు, సర్వారెడ్డిపల్లి నుంచి కొండారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులన్నింటిని దసరా లోపు పూర్తి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దసరా రోజు విచ్చేస్తుండటంతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని, అందుకు అనుగుణంగా గ్రామంలో కొనసాగుతున్న అన్ని రకాల అభివృద్ధి నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీ.వి. రమేష్, ఆయా శాఖల అధికారులు, వంగూరు మండల జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి మహిళా

# చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

**- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజీమ్ అలీ అప్సర్**



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కల్వకుర్తిలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ చూపుతూ అనాటి దేశ్ ముఖులు, రజాకారుల గుండెల్లో భయం పుట్టించిందని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజీమ్ అలీ అప్సర్ అన్నారు. ఒక వైపు సాయుధ పోరాటం చేస్తూనే, మరోవైపు అమ్మలాగా ఉద్యమకారులకు అన్నం పెట్టి ఆదరించిన మహానీయురాలని ఆయన పేర్కొన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగుతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ నినాదాలు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ వర్ధంతిని ప్రభుత్వ పరంగా నిర్వహిస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షులు శాలేశ్వర్, మల్లేష్, బాలస్వామి, బంగారయ్య, కార్యాలయ పర్యవేక్షకులు, కార్యాలయ సిబ్బంది సురేష్, శివప్రసాద్, లక్ష్మయ్య, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు**

**కల్వకుర్తి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** తెలంగాణ వీరనారి, చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఐలమ్మ విగ్రహ కమిటీ కన్వీనర్ మొగిలి దుర్గప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కల్వకుర్తి మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు ముఖ్య అతిథిగా హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పెత్తందార్లకు వ్యతిరేకంగా అనాడే పోరాటం చేసి ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఆమె జీవిత చరిత్రను ఈనాటి సమాజానికి తెలియజేసే విధంగా మనందరం ఆమె పేరిట వివిధ కార్యక్రమాలు చేపట్టాలని, ఆమె చరిత్రను పాఠ్య పుస్తకాల్లో ముద్రించాల్సిన అవసరం ఉందని, భావి తరాలకు ఆదర్శంగా నిలిచిన మహిళను మహిళలందరు ఆదర్శంగా తీసుకొని వారికి జరిగే అన్యాయాలను ఎదురించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. భూమి కోసం, ముక్తి కోసం, పీడిత వర్గాల కోసం పోరాటం చేసి తెలంగాణ సాధన ఉద్యమంలో సైరన్ పూరించిన పోరాట స్ఫూర్తి ప్రధాత చాకలి ఐలమ్మ అని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ షాహేద్, నాయకులు మేకల రాజేందర్, సదానందంగౌడ్, బోడ నరసింహ, వెంకటయ్య, రవిగౌడ్, శ్రీనివాసులు, అంజయ్య, వెంకటేష్, లక్ష్మినరసింహ, జంగయ్య, నాగరాజు, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

**సీఐటీయూ ఆధ్వర్యంలో...**

తెలంగాణ సాయుధ రైతంగా పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలను కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కెవి., సీపీఎం నాయకులు ఎపీ మల్లయ్య, బీసీ సంఘం నాయకులు గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బాలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక బాల్‌రెడ్డిలు హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం రజాకారులపై ఆమె చేసిన తిరుగుబాటును వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, లక్ష్మయ్య, నాగర్జున, కృష్ణ, రాజు, శ్రీనివాసులు, భీమయ్య, శ్రీను, యాదయ్య, తిరుపతయ్య, రేనయ్య, ఉదయ్‌కిరణ్, జాజాల శ్రీను తదితరులు ఉన్నారు.

# ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు భేష్..

**- ఆసుపత్రిని స్వచ్ఛతగా ఉంచడం అభినందనీయం... - డీఎంహెచ్‌ఓ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి**

**కల్వకుర్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** మనోధైర్యం కోల్పోయి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దని జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో ఆత్మహత్య నివారణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని అకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డుల్లో పర్యవేక్షించి రోగులతో, రోగి సహాయకులతో ఇక్కడ అందుతున్న సేవలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం జిల్లా వైద్యాధికారిణితో మత్తు మాట్లాడుతూ మత్తు డాక్టర్లు లేకపోవడంతో శస్త్ర చికిత్సలకు ఆటంకం కలుగుతుందని సూచించారు. దానికి స్పందిస్తూ వారు నోటిఫికేషన్ ఇచ్చామని, ఎవరైనఉంటే జాయిన్‌చేసుకొని వారిని మీ దగ్గరికి పంపించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో పారిశుధ్యం చాలా బాగుందని ప్రశంసించారు. రోగులతో మంచిగా మాట్లాడి వారికి త్వరగా ఆరోగ్యవంతులను చేయడానికి మీరంతా కృషిచేసి ప్రజల మన్ననలు పొందాలని కితాబు ఇచ్చారు. నిరవధికంగా పడుతున్న వర్షాల కారణంగా విషజ్వరాలు మరియు విరేచనాలు, ఊపిరితిత్తుల సంబంధించిన రోగులు, పాము కాటు కేసులు వచ్చే అవకాశం ఎక్కువ ఉన్నందున సకాలంలో స్పందించి నాణ్యమైన వైద్యం అందించేలా చూడాలని సూచించారు. వారితోపాటు డీప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భీమానాయక్, ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ రవికుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాధిక, గైనకాలజిస్ట్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ వసంత, డాక్టర్ పాండురంగ, హెడ్ నర్సు జాయి మెర్సీ, సునిత, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

## అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి



నిలువ నీటిని పారబోయిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

**ఆత్మకూర్ సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రతి వార్డులో అంత వ్యాధుల నివారణ కోసం పాలకవర్గం చేస్తున్న ప్రయత్నాలకు సహకరించాలని మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తదితరులు పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రోజు పట్టణంలోని ఎనిమిది తొమ్మిది పదవ వార్డులలో ప్రత్యేక డ్రైడే కార్యక్రమం నిర్వహించి పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలకవర్గ సిబ్బందికి సహాయ సహకారాలు అందజేసి ప్రస్తుత వర్షాకాల సిజన్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పాలకవర్గానికి సహకరించి అంటువ్యాదులు ప్రబలే అవకాశం ఉన్నందున పాలకవర్గానికి సహకరించి అంటువ్యాధుల నివారణ కోసం చేస్తున్న ప్రయత్నాలకు పూర్తిగా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 10వార్డులో ఉన్నటువంటి మురుగునీటి కాలువలను శుభ్రపరిచేందుకు ప్రత్యేక స్పెషల్ రేవు కార్యక్రమం చేపట్టి బ్లీచింగ్ పౌడర్ ను పిచికారి చేయించారు. పట్టణంలోని ప్రతి వార్డులో ఆయా కౌన్సిలర్లు బాధ్యతగా వ్యవహరించి మురుగునీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపిచే ఏర్పాటు చేయాల్సిందిగా చైర్మన్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు ప్రభుత్వం బేగం రామకృష్ణ, అశ్విని, కుమార్ ,మహేశ్వరి ,అంగన్వాడి సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద ఉధృతి

**- ఒక షెట్టర్లు తెరచి దిగువకు నీటి విడుదల -32.2 ఫీట్లకు చేరిన నీటి నిల్వ**

**దేవరకద్ర, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** వర్షం కురవడంతో జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్ట కోయిల్‌సాగర్‌కు మంగళవారం వరద ఉధృతి బాగా తగ్గింది. దీంతో కేవలం ప్రాజెక్టు1 షెట్టర్‌ను మాత్రం ఫీటు ఎత్తు తెరచి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టుకు 13 షెట్టర్లు ఉన్నాయి. అందులో 1 షెట్టర్‌ను తెరిచారు. అయితే ముందు జాగ్రత్తగా ఈ నెల1న ప్రాజెక్ట 11 షెట్టర్లను తెరిచారు. రోజు రోజుకు ప్రాజెక్టులోకి వచ్చి చేరే నీటి ఉధృతి క్రమేపి తగ్గుముఖం పట్టింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్ట పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు 32.2 ఫీట్లకు వచ్చి చేరింది. వర్షాలు తగ్గడంతో ప్రాజెక్టులోకి వచ్చి చేరే అంకిళ్ళ, కోయిల కొండ పెద్దవాగుల నుండి నీరు ప్రాజెక్టులోకి పెద్దగా వచ్చి చేరడం లేదు. దీంతో ప్రాజెక్టులో నీటి స్థోమత తగ్గింది. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరడంతో కోయిల్‌సాగర్‌కు జలకళ వచ్చింది.

జలస వ్వడి చూపరులను మంత్ర ముగ్దులను చేస్తుంది. ప్రాజెక్ట నిండుకుండను తలపిస్తుంది. ప్రాజెక్టులో కనుచూపు మేర నీరే కనిపిస్తుంది.

ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరిందని తెలుసుకొన్న పర్యాటకులు ప్రాజెక్టును చూడటానికి అధికసంఖ్యలో కోయిల్‌సాగర్‌ను చూడటానికి తరలివస్తున్నారు.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు షెట్టర్ తెరిచిన దృశ్యం

## రక్తదానం మహాదానం..

**15సార్లు రక్తదానం చేసిన సాట కుర్మయ్య**

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గర్భిణీ ప్రసూతి కొరకు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చేరింది.. ఆమెకు పరిక్షలు చేయగా రక్తం తక్కువగా ఉందని ఓ పాజిటివ్ రక్తం అవసరం పడుతుందని వైద్యులు నిర్ధారించగా సమాచారం తెలుసుకున్న సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టంకరి శివప్రసాద్ యాదవ్ వెంటనే స్పందించి పౌండేషన్ సభ్యుడైనటువంటి సాట కుర్మయ్య ఓ పాజీటీవ్ రక్తం దానం చేయడంతో తల్లి బిడ్డ ప్రాణాలతో కాపాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు



రక్తదానం చేస్తున్న సాట కుర్మయ్య

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డా. కిశోర్

**మహ్మదాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మహ్మదాబాద్ మండల కేంద్రంలోని అంగన్‌వాడి సెక్టార్‌లో డా.కిశోర్, డా. అంబదాస్ చిన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లితో పాటు బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని గర్భిణీ స్త్రీలకు తెలిపారు. అలాగే పిల్లలు ఎంత బరువు ఉన్నారనేది చూసి తక్కువ బరువు ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మహబూబ్‌నగర్ ఎన్సీకి రెఫర్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ మల్లమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లు అరుణ, వరలక్ష్మి, లలిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయునికి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

**పెబ్బేరు సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం బునాదిపురం గ్రామంలో ప్రాథమికొన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి దుర్గాప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైనా సందర్భంగా దుర్గాప్రసాద్ సన్మానిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగశేషు ఉపాధ్యాయులు దయానంద్, మల్లికార్జున్ రెడ్డి అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసులు



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం













**గద్వాల సెప్టెంబర్10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీర వనిత చాకలి ఐలమ్మ త్యాగం, అంకితభావం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని, ఆమె చూపిన ధైర్యం నేటి తరానికి మార్గదర్శకమని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఐడిఓసి ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్ర మం ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వీరభద్రప్ప, ఇంచార్జిబీసీ సంక్షేమశాఖ అధికారి రమేశ్ బాబు, అధికారులు, కలెక్టర్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**మక్తల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** తెలంగాణ పోరాట యోధురాలు, ధీరవనిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలను మక్తల్ మండలంలోని చిట్యాలలో మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లప్ప, ఇస్త్రీ అంజప్ప, ఆంజనేయులు, జెసిబిబాలు, పెద్ద బాబు, ఆదెప్ప, శేషప్ప, బాలప్ప, లక్ష్మి, శంకరమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

**వీపనగండ్ల సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** మంగళవారం నాడు సిపిఎం, రైతు సంఘం ,రజక సంఘం ఆధ్వర్యంలో వీపనగండ్ల మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సభను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నక్క ఆంజనేయులు, రాములు, రామకృష్ణ, నవీన్, రైతులు వెంకటస్వామి, బాల పేరు, జానకి రాముడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తకోట సెప్టెంబర్10 ప్రభాతవార్త:** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం ఆయా పార్టీల నాయకులు రజక కుల సంఘ సభ్యులు చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలుఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుకేషిణి విశ్వేశ్వర్, 4వ వార్డు కౌన్సిలర్ నారాయణమ్మ వెంకట్‌రెడ్డి, రజక సంఘం అధ్యక్షులు బాలస్వామి, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**ఇటిక్యాల సెప్టెంబర్10, ప్రభాతవార్త:** భూమి భుక్తి కోసం జరిగిన రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో నాయకులు భీమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి, రెవిన్యూ కార్యాలయ సిబ్బంది నాయకులు తిమ్మప్ప, బీచుపల్లి, రామకృష్ణ, బొజ్జన్న, శివపురి, కురుమూర్తి మధు నాయుడు, మెడికల్ మద్దిలేటి యాదవ్ రాగన్న, ధర్మారెడ్డి, పెద్ద లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరు సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపల్ లోని మార్కెట్ యార్డ్ కాంప్లెక్స్ లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలతో అలంకరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కిశ్రీనివాస్‌గౌడ్ బోయసత్తి, రజకసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ, సూరయ్య, శ్రీనివాసులు, జయన్న, కాసిం గ్రామ పెద్దలు గ్రామ యువకులు పాల్గొన్నారు.

**వంగూరు, సెప్టెంబర్10 ప్రభాతవార్త:** మంగళవారం వంగూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయఆవరణలో రజక సంఘంఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, సుమన్, మురళి, చక్రవర్తి, రాజు, అజయ్, గెల్వయ్య, రాములు, రామచంద్రం, ఆనంద్, హరిదాస్, పర్వతాలు, మణెమ్మ, సీపీఎం నాయకులు బాలస్వామి, జువ్వ కృష్ణయ్య, మురళిగౌడ్ ఉన్నారు.

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు10 ప్రభాతవార్త :** చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దామని రజక సంఘం జిల్లా నాయకులు సాయిబన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలు ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జి.కృష్ణ, నాగప్ప, శానప్ప, వెంకటప్ప, బ్యాంక్ సాయిలు, శేషు, బాలరాజు, రాజు, చంద్రకాంత్, చంద్రశేఖర్ మహిళలు లలితమ్మ, ఈరమ్మ, పద్ద పాల్గొన్నారు.

**బాలానగర్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ కాంగ్రెస్ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతి, ఓబిసి సెల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తిరుపతి, ఓబిసి సెల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పొట్లపల్లియాదయ్య, మాజీ ఎంపిటిసి లక్ష్మయ్య, చుక్కంపేట్‌అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పెద్దయపల్లి లక్ష్మయ్య, రజక సంఘం అధ్యక్షులు చిట్యాల శంకర్, రజక సంఘం నాయకులుజంగయ్య, మధు, వెంకటేష్, భాస్కర్, రామయ్య, రాములు, కృష్ణయ్య, రత్న, వెంకటేష్ పాల్గొన్నారు.

**మహ్మదాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సి. రాములు, బిజెపి మండలఅధ్యక్షుడు కృష్ణ, అనంతయ్య గుప్త, పవన్‌కుమార్, గూళ్ల శ్రీనివాస్, వేణుగౌడ్, మంగలి బాలరాజ్, వెంకటయ్య, దస్తయ్య, మైబూ, బ్రహ్మం, విష్ణు పాల్గొన్నారు.

## ఒక్క క్షణం ఆలోచించు.. ఆత్మహత్య నివారించు

◆ ఆత్మస్థైర్యమే ఆత్మహత్య నిరోధానికి తోడ్పాటు: డాక్టర్ బోనాసి ఆలోచన



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డా. ఆలోచన

**బిజినపల్లి, సెప్టెంబరు10 ప్రభాతవార్త:** జీవితంలో సమస్యలు మరణానికి దారి తీయకూడదని, సమస్యలకు పరిష్కారం మరణం కాదని ప్రతి ఒక్కరు ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు వెళ్లాని లట్టుపల్లి వైద్యాధికారి డా. బోనాసి ఆలోచన అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగనూరు, గంగారం జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో ఆత్మహత్యల నివారణ కార్యక్రమంపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డా. ఆలోచన మాట్లాడుతూ మంచి ఆలోచనలు ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని, సమాజంలో ఆర్థిక సామాజిక శారీరక మానసిక ఇబ్బందులు ఉన్నప్పుడు తప్పనిసరిగా తోటి వారితో, బంధువులతో, స్నేహితులతో పక్కవారితో విషయాలను చెప్పుకొని మానసికస్థితి మెరుగు పరచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక లక్ష్యంతో చదవాలన్నారు. మానసిక ఒత్తిడి నివారించుటకు ప్రతి విద్యార్థి కొంత సమయం యోగా, ధ్యానం, ఆటలాడడం, సైక్లింగ్, వ్యాయామం అలవర్చుకోవాలన్నారు. గంగారంలో డా.తేజస్విని మాట్లాడుతూ విద్యార్థులకు ఆత్మస్థైర్యాన్ని నింపుతూ ఆత్మహత్యలు చేసుకునే సందర్భాలు నివారణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా తెలిపారు. ప్రతి విద్యార్థి పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సాత్విక ఆహారంతో ఆలోచనలు మెరుగుపడతాయన్నారు. అవసర మైన వారు టెలిమానస్ 14416 నంబర్లను సంప్రదించి ఉచితంగా సూచనలను సలహాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు వరప్రసాద్, బాలకృష్ణారెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు బాలమణి, శశికళ, ఆరోగ్య కార్యకర్తలు టి.యాదగిరి, అబ్దుల్ సలీం, జ్యోతి జకియా బేగం, పాఠశాలల ఉపాధ్యాయులు మల్లికార్జున్, రాజారాం, రత్నశేఖర్, సువర్ణ, నాగభారతి, యాదగిరి విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని వినతి

**తెల్కపల్లి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనం చేయడానికి మండల కేంద్రంలోని స్థానిక పెద్ద చెరువు దగ్గర ఏర్పాట్లు చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులు తెల్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు దగ్గర కట్టపైన కంపచెట్లు ఉన్నాయని నిమజ్జనానికి ఇబ్బంది అవుతుందని వాటిని వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని వవారు ఈ సందర్భంగా కోరారు.

## నేడు ఉల్లిపంట తెగుళ్లపైన శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

**చిన్నంబావి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** మడల పరిధిలోని కొప్పునూర్ గ్రామంతో పాటు పలు గ్రామాలలో ఉల్లిసాగు చేసిన రైతులకు నేడు ఉల్లి, మిరప పంటల్లో ప్రస్తుతం ఉన్న తెగుళ్లను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేయడానికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన కార్యక్రమం కొనసాగుతుంది. మండల రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉల్లి పంటలో వచ్చే చీడపీడలు, తెగుళ్ల గురించి సంపూర్ణంగా మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో సూచనలు, సలహాలు స్వీకరించాలని వ్యవసాయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్టుగా కొండారెడ్డిపల్లి

మొదటి పేజీ తరువాయి భాగం..

ద్వారా కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. గ్రామ మహిళా జ్యోతి సంఘం సభ్యురాలు లక్ష్మమ్మను గృహ అవసరాల కు సరిపడే విద్యుత్ సూర్యుడి ఎండ ద్వారా తయారు చేసుకోవ చ్చునని, మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించుకోవచ్చునని అవగాహన కల్పించారు. కొండారెడ్డిపల్లి గ్రామంలోని గృహ అవస రాలకు సంబంధించి 499 సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయని, వాణిజ్య అవసరాలకు సంబంధించి 66 సర్వీస్ కనెక్షన్లు, పరిశ్రమలకు సంబంధించి 10 కనెక్షన్లు, 867 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, విద్యుత్ దీపాలకు సంబంధించి 7 కనెక్షన్లు ఉన్నాయని, విద్యకు సంబంధించి 2 కనెక్షన్లు ఉన్నాయని, వీటన్నింటికి కావాల్సిన ఓల్టేజీ తగ్గ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు కొండారెడ్డిపల్లి గ్రామానికి విచ్చేసిన విద్యుత్ సీఎండీ ముషరఫ్ అలీ ఫరుఖీని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రెడ్ కో మేనేజింగ్ డైరెక్టర్ అనిల్, సెర్ప్ డైరెక్టర్ కృష్ణ, డైరెక్టర్ రాములు, అదనపు కలెక్టర్ దేవాసహాయం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీ.వి.రమేష్, ఆయా శాఖల అధికారులు, మాజీ జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి ఉన్నారు.

## నాటుసారాను అరికడతాం

మొదటి పేజీ తరువాయి భాగం..

సమీక్షా సమావేశంలో అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెంచి పని చేయాలని ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తేవాలని ఆయన యంత్రాంగానికి సూచించారు. నాటుసారా తయారీకి వినియోగిస్తున్నటువంటి బెల్లం, అల్లం, కల్తీకల్లుకు వినియోగిస్తున్న అల్ప్రాజోలంపట్టుకోవాలని సూచించారు. మీడియా సమావేశంలో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి, డప్యూటి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎస్. గాయత్రి ఇతర అధికారులు హాజరయ్యారు.

## 106 ఎకరాలు అన్యాక్రాంతం

మొదటి పేజీ తరువాయి భాగం..

కొందరు ప్రైవేట్ వ్యక్తులు, కొందరు నేతల బినామీలు ప్రయత్నిస్తున్నారని ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని అనిరుధ్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను తనలేఖలో కోరారు. కాగా జడ్చర్లలోని సర్వేనంబర్ 149లో ఉన్న 7.33 ఎకరాల భూముల్లో జరిగిన అక్రమాలపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ఆ సర్వే నంబర్‌లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని మరొక లేఖను కూడా అనిరుధ్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఇచ్చారు. సర్వే నంబర్ 149లోజరిగిన భూ అక్రమాలకు సంబంధించిన అధికార పత్రాలను కూడా కలెక్టర్ అందజేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ భూ అక్రమాలపై విచారణ చేపట్టి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూముల్లో అది ప్రభుత్వ భూమి అని తెలిపే బోర్డులను పాతాలని, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేయించడానికి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగానే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన భూములను కబ్జా చేసిన వారు ఎంతటివారైనా వదిలేది లేదని స్పష్టం చేశారు.

## దేవస్థానం వారే లడ్డు ప్రసాదం విక్రయించాలి

### కోట్లల్లో ఆదాయం వస్తున్న సౌకర్యాలు మాత్రం శూన్యం : బిజెపి నాయకులు



మాట్లాడుతున్న దేవస్థాన కమిటీ సభ్యులు

**చిన్నచింతకుంట, సెప్టెంబరు10 ప్రభాతవార్త:** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న శ్రీ కురుమూర్తి స్వామి పుణ్య క్షేత్రంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా టెండర్ల ద్వారా కోట్లల్లో ఆదాయం వస్తున్న భక్తుల సౌకర్యాలు మాత్రం శూన్యమని బిజెపి జిల్లా నాయకులు నంబిరాజు, కురువ రమేష్, సుదర్శన్‌గౌడ్‌లు విమర్శించారు. స్వామివారి లడ్డు ప్రసాదం, పులిహోర టెండర్లు నిర్వహించడం వల్ల టెండర్‌దారులు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా లడ్డు ప్రసాదం, పులిహోరను విక్రయించడం వల్ల భక్తులు రుచిగా లేని లడ్డు ప్రసాదం, పులిహోరాను తినలేక ఇబ్బందులు పడుతున్న దేవస్థానం అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. మన్నెంకొండ దేవస్థానంలో దేవస్థానం ఆధ్వర్యంలో లడ్డు ప్రసాదం విక్రయిస్తున్నారు. అలాగే శ్రీకురుమూర్తిస్వామి దేవస్థానం వవారి ఆధ్వర్యంలో లడ్డుప్రసాదం, పులిహోరను విక్రయించాలని వారు డిమాండ్ చేశారు. రాజారాంభూపాల్ అనుచరుల కోసం ఇష్టారాజ్యంగా రాజా రాంభూపాల్ అనుచరుల కోసం ఇష్టారాజ్యంగా స్వామివారి లడ్డుప్రసాదం, పులిహోర ధరలను పెంచుతూ భక్తులను దోచుకుంటున్నారని వారు ఆరోపించారు. టెండర్ల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తున్న భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని వారు విమర్శించారు. టెంకాయ టెండరుదారులు దేవస్థాన నిబంధనల మేరకు ఒక్క టెంకాయ రూ.25 కు అమ్మాలి కానీ జాతర సమయంలో 30 నుండి 40 వరకు టెంకాయను విక్రయిస్తూ భక్తుల జేబులు చిల్లులు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడనివారు విమర్శించారు. గతంలో టెండర్లు లేకుండా వ్యాపారస్తుల నుండి దేవస్థాన సిబ్బంది, పాలక మండలి సభ్యులు ఇష్టారాజ్యంగా దోచుకున్నారని దీనిపై దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. లడ్డు ప్రసాదం, పులిహోర ధరను పెంచుతూ టెండర్లు నిర్వహిస్తే అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. దేవస్థాన నిబంధనల మేరకు జాతరలో వ్యాపారులునడుచుకోవాలని అలాకాకుండా నిబంధనలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే బిజెపి ఆధ్వర్యంలో అడ్డుకుంటామని వారు తెలిపారు. సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులుదశరథ్, నాయకులుశ్రీకృష్ణ, నరెందర్‌జీ, మహేష్ యాదవ్, మనోహర్, వికాస్ నరసింహ, బాలచందర్ పాల్గొన్నారు.

## గురుతర బాధ్యత పెరిగింది : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కిశోర్



కిశోర్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్, పియు అధ్యాపక బృందం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో పరిపాలన భవనంలో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందిన మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు డా. కిశోర్, అసోసియేట్ ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి, ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై డా. కిశోర్‌కు ఉత్తమ టీచర్ అవార్డు మనందరికి గర్వకారణమని, బోధనలో నూతన పద్ధతులు అవలంబించి, విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి చెందేటట్లు చేయాలని అన్నారు. పిజి కళాశాల ప్రిన్సిపల్ డా. చంద్రకిరణ్ మాట్లాడుతూ డా. కిశోర్ ఎంతో కష్టపడ్డాడని, టీచింగ్‌తో పాటు రీసెర్చ్‌లో 52 పబ్లికేషన్స్ రావడం ద్వారా యూనివర్సిటీకి నాక్ గుర్తింపులో ఉపయోగపడుతుందని అన్నారు. సన్మాన గ్రహీత డా. కిశోర్ మాట్లాడుతూ అవార్డు రావడంతో మరింత గురుతర బాధ్యత పెరిగిందని, 2009 నుంచి ఇప్పటివరకు యూనివర్సిటీ అధికారులు ఏ బాధ్యత అప్పజెప్పిన, ఎంతో చిత్తశుద్ధితో పని చేశానని పని చేసుకుంటే వెళుతుంటే ఫలితాలు వాటంతట అవే వస్తాయని యూనివర్సిటీలో టీచింగ్‌తో పాటు పరిశోధలనపై దృష్టి సారించాలని, ప్రభుత్వం తన సేవలను గుర్తించి అవార్డు ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డా. రాజ్‌కుమార్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డా. విజయలక్ష్మి డా. శాంతిప్రియ, ప్రిన్సిపాల్ డా. నూర్జహాన్, డా.బషీర్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ డా.కృష్ణయ్య, ప్రొ॥ జైపాల్‌రెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. అంకం భాస్కర్, వివిధ విభాగాధిపతులు డా.నాగం కుమారస్వామి, డా. ప్రభాకర్‌రెడ్డి, డా. శ్రీధర్‌రెడ్డి, డా. నాగసుధ, డా. పుష్పలత, ఒప్పంద అధ్యాపక సంఘం నాయకులు డా. అర్జున్‌కుమార్, డా. రవికుమార్, డా. భూమయ్య, సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు రామ్మోహన్, సురేష్, నాగరాజు, డా. విజయభాస్కర్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవిందర్, సంఘం నాయకులు రామ్మోహన్, కిరణ్, సత్యం పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలను పరిశీలించిన ఎలక్ట్రానిక్ మీడియా బృందం



జర్నలిస్టు స్థలాలను పరిశీలిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా

**కొల్లాపూర్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** పట్టణంలోని చౌటబెట్ల శివారులో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాన్ని మంగళవారం ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల బృందం సందర్శించడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు చౌటబెట్ల శివారులో నేషనల్ హైవే 167 కె సమీపంలో ఉన్న ఇళ్ల స్థలాన్ని ఎలక్ట్రానిక్ మీడియా బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా సందర్శించిన ప్రతినిధి బృందం మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మెలుగుతున్న జర్నలిస్టులకు సర్వే నంబర్ 72/3 ఒక ఎకరా 20 గుంటల స్థలాన్ని కేటాయించిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లస్థలాలు కేటాయిస్తూ వారికి గూడు నీడ ఏర్పాటు చేయడం అభినందనీయమని వీలైనంత త్వరగా ప్రస్తుత ఆ స్థలాన్ని ప్రస్తుత రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జర్నలిస్టులకు త్వరగా పట్టాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సాక్షి టివి మాలె రాజేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టివి9 సురేష్, కోశాధికారి ఐన్యూస్ నరసింహ, ఎన్‌టివి వినోద్, వి6 పుల్లయ్య, మహాన్యూస్ రామ్‌రెడ్డి, ఈటీవీ భారత్ గోవిందు, టిన్యూస్ కేశవులు, 99 టివి రాజేష్‌గౌడ్, హెచ్‌ఎంటివి వెంకటేష్, 10 టివి చాంద్‌పాషా, ప్రైమ్ న్యూస్ సతీష్, 6 టివి ప్రదీప్, అమ్మ న్యూస్ వెంకటేష్, క్యూ న్యూస్ కిరణ్ పాల్గొన్నారు.

## నాస్ పరీక్షలను పర్యవేక్షించిన ఏఎంఓ



విద్యార్థులకు నిర్వహించిన నాస్ పరీక్షను పర్యవేక్షిస్తున్న ఏఎంఓ

**భూత్పూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖ అకాడెమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ మంగళవారం భూత్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో 6, 9వ తరగతుల 120మంది విద్యార్థిని విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) కోసం నిర్వహించి న పరీక్షను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఎంఓ దుంకుడు మాట్లాడుతూ నాస్ ప్రిపరేటరీ టెస్ట్‌గా సెప్టెంబర్ 10న, సెప్టెంబర్ 30న, నవంబర్ 8న ఉంటా యని తెలిపారు. తుది పరీక్ష నవంబర్ 19న దేశవ్యాప్తంగా ఉంటుందని, పరీక్ష నాస్ ఓఎంఆర్ పద్దతిన ఉంటుందని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ తెలిపారు. ప్రాథమిక స్థాయిలో 3వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూల్‌లో కూడా నాస్ పరీక్షలు నిర్వహించుకోవచ్చని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనందమ్మ, సీఆర్‌పీ ఠాగూర్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల సమస్యకు స్పందించిన ఎమ్మెల్యే

**పెబ్బేరు సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల పరిధిలోని సుగూర్ గ్రామంలో గత కొన్ని నెలలుగా పేరుకుపోయి మురుగుగా మారిన గుంతల వల్ల గ్రామ ప్రజలు చాలా అసౌకర్యానికి గురవుతు రోగాల బారిన పడుతున్న విషయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ,తక్షణమే స్పందించిన, ఎమ్మెల్యే ఈ సమస్యను పరిష్కారించాలని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆదేశించగా, వారు నేడు ఈ సమస్యను పరిష్కారించారు. తమ సమస్యను తక్షణమే పరిష్కారించినందుకు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నరసింహ నాయుడు, మండగిరిరాములు, అప్పారాల మన్యం, ఉప్పరిస్వామి ,బోయ రాజు, కుమ్మరి ఎల్లస్వామి, కాయ్యుమ్, దండు వెంకటయ్య , గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన ప్రదీప్‌కుమార్‌గౌడ్

**దేవరకద్ర, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లో మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను దేవరకద్ర నియోజకవర్గ సీనియర్ నాయకుడు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియమింపబడ్డ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలసి తిరుపతి స్వామి ప్రసాదాన్ని కూడ ప్రదీప్‌కుమార్‌గౌడ్ అందజేశారు. అలాగే ఆయనకు శాలువాతో సత్కరించి పూలబొకేను అందజేసి ప్రదీప్‌కుమార్‌గౌడ్ హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ శ్రేణులపై అక్రమ కేసులు

**పెబ్బేరు సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో అవకతవకలు జరిగినవి, ఆ విషయంపై ప్రశ్నించినందుకు, వనపర్తి రోడ్డు విస్తరణలో పాక్షికంగా ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయపరంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి ఫాట్లు కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులమైన మేము బాధితులకు న్యాయం జరగాలని నిరసన వ్యక్తం చేస్తే మా పైన అక్రమ కేసులు పెట్టడం జరిగింది, అందులో భాగంగా నేడు వనపర్తి కోర్ట్‌కు హాజరవడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం

**కొత్తకోట సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** మదనాపురం మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన పల్లెపాగు ప్రశాంత్, వైస్‌చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటనారాయణ శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మదనాపూర్ మండల తహశీల్దార్ జాన్ వెస్లీని కూడా శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కొత్త పాలక వర్గం రైతుల పక్షాన పని చేయాలని రైతులకు ఎల్లపుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలని వెంకట్ నారాయణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగన్న, శంకర యాదవ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డయాగ్నోస్టిక్ కేంద్రం ప్రారంభం

**మక్తల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** మక్తల్ ప్రాంతంలోని పేద ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని, ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యపరీక్షలు చేసి వారి మనస్సులను చూరగొనాలని మాజీ ఎంపిటిసి జి.బలరాంరెడ్డి అన్నారు. మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మి డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని మంగళవారంఆయన ప్రారంభించారు. అనంతరం పలువురికి ఉచితంగా రక్తపరీక్షలు, బిపి, షుగర్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుర్లపల్లి వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంపల్లి కొండయ్య, అమీనొద్దిన్ పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ప్రదేశాల్ని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

**భూత్పూర్, సెప్టెంబర్10.ప్రభాతవార్త:** గణేష్ నిమజ్జనం కోసం భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు చెర్వులను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. అమిస్తాపూర్‌లోని బోడమాన్ చెర్వు, భూత్పూర్‌లోని ఊరగుంట చెర్వు, కథాల్‌ఖాన్ చెర్వులను సందర్శించి ట్యాంక్ బండ్‌లను ఆయన పరిశీలించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు కరపత్రాలు విడుదల

**కృష్ణ, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** కృష్ణమండల కేంద్రంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30న నిర్వహించే సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటి తరపున నిర్వహించబోయే సమాచార హక్కుచట్టం 2005 అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఎంపిడిఓ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లాఉపాధ్యక్షులు పతంగి చిన్నయ్య, మండల ప్రధాన కార్యదర్శిజిందప్ప, కోరిమని దేవప్ప, పంతిగివెంకటేష్ పాల్గొన్నారు.

## అధిక వర్షాలకు కూలిన ఇండ్లు

**చిన్నంబావి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పంటలతో పాటు పలు ఇండ్లు దెబ్బతిన్నాయి. చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామంలో గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు గ్రామంలో పూజారి నరసింహ ఇల్లు, మాదాసి కురువ పెద్ద మల్లయ్య ఇల్లు అధిక వర్షాలకు కూలిపోయాయి. ఒక్కొక్క ఇల్లు సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు వారు తెలిపారు. కూలిపోయిన ఇళ్లకు మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలనివారు మీడియా ముందు వాపోయారు. గ్రామంలో పలు ఇల్లు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే దశలో ఉన్నాయని, శ్రీశైలం నిర్వాసిత గ్రామం కావడంతో మట్టి మిద్దెలన్నింటికి ఆర్‌సిసి మంజూరు చేయాలని పలువురు గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10వేల జరిమానా..

**లింగాల, సెప్టెంబరు10 ప్రభాతవార్త:** మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రూ. 10వేల జరిమానా విధించినట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. వాహనాలను తనిఖీలు చేస్తున్న క్రమంలో సోమవారం సాయంత్రం డిసిఎం కూల్ డ్రిక్ లోడు వాహనం తెల్కపల్లి నుంచి లింగాల వైపు వస్తుందని, డ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో డ్రైవర్ రవికి డ్రంక్‌అండ్ డ్రైవ్ నిర్వహించారు. రవి మద్యం తాగాడని తేలడంతో అతనిపై కేసు నమోదు చేసుకుని బుధవారం అచ్చంపేట కోర్టులో హాజరు పర్చగా అతనికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. వాహనదారులు ఎవ్వరికైనా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

# స్నేహితుడి కుటుంబానికి చేయూత


మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

**అడ్డాకుల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన ఔట్‌సోర్సింగ్ లైన్‌మెన్ మునగల రవి ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. రవి కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు 2008,2009 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకుని బృందంగా ఏర్పడి స్నేహితులందరూ కలిసి మానవత్వ దృక్పథంతో రవి కుటుంబానికి రూ.50,400ల జమ నగదు మొత్తాన్ని భార్య, కుమారుని పేరిట పోస్టాంఫీస్‌లో అకౌంట్ ఫిక్స్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ పేపర్ పత్రాన్ని రవి కుటుంబ సభ్యులకు అందజేశారు. స్నేహమంటే కేవలం స్కూలు, కాలేజీలు దాటేవరకే కాదు లోకం విడిచి వెళ్లిన తర్వాత కూడా స్నేహం తోడు ఉంటుందని చాటిచెప్పారు. సృష్టిలో ప్రతి బంధాన్ని దేవుడే నిర్ణయిస్తాడు. స్నేహితులను మనమే ఎంచుకుంటాం కేవలం సంతోషంలో కాదు కష్టంలో కూడా తోడుండేవాడే స్నేహితులు. ఏ బంధంలోనైనాస్వార్థంఉండదని స్నేహితులు నిరూపించారు.రవి కుటుంబానికి స్నేహితులు మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు పవన్ కుమార్ యాదవ్, సురెందర్,రాఘవేంద్ర, శివకృష్ణ, విజయ్,శశికళ, ఏసమ్మ, అనురాధ, అశోక్, రాజు, ప్రియాంక,మురళి,మునగల బాలరాజు పాల్గొన్నారు.

## పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

**వెల్దండ, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** మండలంలో విజయ డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతులకు బిల్లులను సకాలంలో చెల్లించడం లేదని విజయ డైరీ చైర్మన్ ఎండీ.యూఖుబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సకాలంలో రైతులకు పాల బిల్లులు అందించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా కృషి చేస్తామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్,మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, అలీ,నారాయణనాయక్, రంగయ్య, రషీద్, రాజవర్ధన్‌రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

## నూతన బ్రిడ్జిని నిర్మిస్తాం

◆కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


కాజేవేల వద్ద తాత్కాలిక మరమ్మత్తు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, సెప్టెంబర్10 ప్రభాతవార్త:** మండలంలో భైరాపూర్ వాగు, గానుగట్టుతాండల వద్ద ఉన్న కాజ్‌వే (బ్రిడ్జి)లు ఆదివారం వచ్చిన భారీ వరదలకు దెబ్బతినడంతో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు బ్రిడ్జి కాజేవ్‌ల వద్ద వాహనాలు దాటడానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో పనులు చేపట్టారు.మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భైరాపూర్ వాగుపై ఉన్న కాజ్‌వే, గానుగట్టు తాండ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వరదకు దెబ్బతిన్న కాజేవ్ వద్ద తాత్కాలిక పనులు పూర్తి కావ డంతో రవాణా సౌకర్యం మెరుగుపడిందన్నారు. వచ్చే వర్షకాలం నాటికి కొత్త బ్రిడ్జి నిర్మాణాలను చేపడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదే విధంగా బండోనిపల్లి వద్ద దెబ్బతిన్న గూనలను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు యెన్నంభూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్,పుల్లయ్య,రషీద్, అలీ,పత్యానాయక్, గోపాల్‌నాయక్, రాజశేఖర్, లక్ష్మమ్మ, జంగయ్య,నర్సింహ్మ, కేశమల్ల కృష్ణ ఉన్నారు.

## మహిళా సంఘాల బలోపేతానికి పెద్దపీట

■వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


కళ్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేఘారెడ్డి

**గోపాల్‌పేట సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** మహిళా సంఘాల బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేసిందని రానున్న రోజుల్లో మహిళా సంఘాలన్ని ఆర్థిక అభివృద్ధి సాధిస్తాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం గోపాల్‌పేట మండల తహాశీల్దార్ కార్యాలయం సమావేశా మందిరం నందు ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 49 మంది షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం నేడు పాఠశాల,వసతి గృహాల విద్యార్థులకు యూనిఫామ్ లను కుట్టించే ప్రక్రియను వారికి అప్పగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోఉమ్మడి మండల ఇంచార్జి సత్యశీలారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్,టౌన్ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు మంగదొడ్డి నాగ శేషు యాదవ్,మాజీ వైస్ఎంపీపీ చంద్రశేఖర్,కేతపల్లి వెంకటయ్య,బ్యాదరీ శాంతయ్య,మేస్త్రి శివ,రవినాయక్, శ్రీశైలం,తెలుగు బాలయ్య,శ్రీరాములు వెంకటేష్, వెంకట్‌రెడ్డి,అబ్దుల్లా, వెంకటస్వామి, కరుణాకర్, గోవర్ధన్‌రెడ్డి, దిరుమల్ల, ఎల్లయ్య, శంకరయ్య, అధికారులు వివిధ గ్రామాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల నివారణకు ఆత్మహత్య పరిష్కారం కాదు

◆క్షణికావేశంలో విలువైన ప్రాణాలను కోల్పోవద్దు : డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

**కల్వకుర్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** జీవితం చాలా విలువైనది... చిన్న చిన్న సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని జిల్లా డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాంరెడ్డి అధ్యక్షతన ఆత్మ హత్య నివారణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. చిన్న చిన్న విషయాలకు ఎక్కువగా ఆలోచించి ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని తద్వారా సమస్యల నుంచి బయట పడి విజయం సాధించాలన్నారు. మానసిక ధృడత్వం పెంచుకోవడానికి యోగా లాంటివి చేయాలన్నారు. పిజియోథెరపి డాక్టర్ అంబుజ మాట్లాడుతూ క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోరాదని, జీవితంలో రాణించడానికి ఎన్నో మార్గాలున్నాయన్నారు. కార్యక్రమంలో డీఐఓ డా.కే.రవికుమార్‌నాయక్, కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, డాక్టర్లు భీమానాయక్, కృష్ణమోహన్, రాధిక, క్లస్టర్ స్టాఫ్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు బావండ్లవెంకటేష్, కళాశాలఅధ్యాపకులు సదానందం గౌడ్, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

## ఆటో బోల్తా

నాలుగురు విద్యార్థులకు గాయాలు


తీవ్రంగా గాయపడిన విద్యార్థి

**పెబ్బేరు సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు రోజు ఆటోలో ప్రయాణించే వాలు అదేవిధంగా మంగళవారం రోజు సాయంత్రం కూడా స్కూల్ నుంచి 7 గురు విద్యార్థులు ఇంటికి తిరిగి ప్రయాణమయ్యారు. డ్రైవర్ మద్యం మత్తులో చేతులు విడిచిపెట్టి నడపడం వల్ల ఆటో స్కిడ్ అయికింద పడింది. నలుగురు విద్యార్థులకు గాయాలు తగిలాయి ఇప్పుడైనా అధికారులు స్పందించి విద్యార్థులకు మనో బస్సు ఏర్పాటు చేయగలరని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కొత్తమొల్గరలో గుర్తుతెలియని మహిళ మృతి


మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

**భూత్పూర్,సెప్టెంబర్ 10,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలంలోని కొత్తమొల్గర గ్రామానికి సమీపంలో మహబూబ్‌నగర్ రోడ్ ఓ గుర్తు తెలియని సుమారు 45ఏళ్ల వయసున్న మహిళ మృతి చెందినట్లు భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెలి పారు. మతిస్థి మితంలేని మహిళగా స్థానికులు,ఉపాధి హామి కూలీలు గుర్తించారని,కొన ఊపిరితో ఉన్నమహిళ దాహం.. దాహం అంటుండగా గమనించి తమ వద్ద ఉన్న కొన్ని మంచినీళ్లను ఉపాధి కూలీలు ఇచ్చారని, నీళ్లు తాగిన కొద్ది సేపటికి ఆకలి ఆకలి అంటూ మహిళ ప్రాణాలువిడిచినట్లు ఫీల్డ్‌అసిస్టెంట్ బాల మాసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## తోటీ మిత్రునికి ఆర్థిక సహాయం



**పెబ్బేరు సెప్టెంబర్10 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలోని జడ్పీహెచ్ హై స్కూల్లో 2003-04 సంవత్సరం 10వ తరగతి మిత్ర బృందం అందరూ కలిసి తోటి మిత్రుడు బీసన్నకు ప్రమాదవశాత్తు రెండు కాళ్లు విరిగి పోయినందుకు అతనికి ఆర్థిక సహాయంగా మిత్రులందరు కలిసి వైద్య ఖర్చులకు తమ వంతు 40 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎస్ఎస్‌సిమిత్ర బృందం 2003-04సంవత్సరం ఉన్నతపాఠశాల పెబ్బేరు సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన జర్నలిస్టులు

**కొత్తకోట 10 ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల మరణించగా మంగళవారం కొత్తకోట జర్నలిస్టులు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని అయన స్వగృహమైన దామగ్నపూర్ గ్రామంలో కొత్తకోట జర్నలిస్టులు పరామర్శించారు. ముందుగా స్వర్గీయ కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో కొత్తకోట ఆంధ్రజ్యోతి విలేఖరి రాములు, ప్రజాతంత్ర జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నా కొండ యాదవ్,వార్త రిపోర్టర్ ధనుష్,వెలుగు రిపోర్టర్ లక్ష్మీ నారాయణ, ఎలక్ట్రాన్ మీడియా విలేకరులు కిషోర్,చుక్కారెడ్డి,నాగరాజు తదితరులు ఉన్నారు.



## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

**వెల్దండ, సెప్టెంబర్10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై రోజు వారి లాగానే పోలీసుల వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం మద్యం సేవించి వాహనం నడుపుతున్న పెద్దాపూర్ గ్రామానికి దండుగుల శేఖర్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసునమోదు చేయగా...అట్టి కేసులో కల్వకుర్తి జేఎఫ్‌సిఎం న్యాయమూర్తి కావ్య కేసును విచారించి శేఖర్‌కు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

## ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు కేంద్ర కమిటి పిలుపులో భాగంగా మంగళవారం దామరగిద్ద మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం, జిల్లా ఉపాధ్యక్షులు జోషి మాట్లాడుతూ ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు అరుణ, వీరమ్మ, మణెమ్మ, విజయలక్ష్మి, కవిత, రాధికతో పాటు తదితరులు ఉన్నారు.

## వ్యాసరచన పోటీలు

**లింగాల, సెప్టెంబరు10 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి 99వ పుట్టి నరోజు సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గం.లకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు గుబ్బ శంకర్,జిల్లా విద్యా విభాగం సమన్వయకర్త మంద రమేష్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఎనిమిదవ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొనాలని కోరారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం గెలుపొందిన విజేతకు స్వర్ణ పతాకం అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## పిడిఎస్ రైస్ పట్టివేత

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు10 ప్రభాతవార్త :** రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు అమ్మకాలకు తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు మంగళవారం దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో ఎం. వెంకటేష్ అనే వ్యక్తి ఆటోలో వత్తుగుండ్ల నుండి కర్ణాటకకు పిడిఎస్ రైస్ ఆటలో తీసుకెళ్తుంటే టాస్క్‌ఫోర్స్, దామరగిద్ద పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకుని విచారించగా వత్తుగుండ్ల గ్రామంలోపిడిఎస్ రైస్ సేకరించికర్ణాటకలో ఎక్కువ డబ్బులకుఅమ్మడానికి తీసుకెళ్తున్నానని తెలుపగా డిటి ఆనందం విచారణ అనంతరంపిడిఎస్ రైస్7.20 క్వింటాళ్లు అక్రమంగా పిడిఎస్‌రైస్ తరలిస్తున్న ఎం.వెంకటేష్‌పై కేసు నమోదుచేయడం జరిగిందని దామరగిద్ద ఎస్సై తెలిపారు.

## డిజెలకు అనుమతి లేదు : సిఐ

**బాలానగర్, సెప్టెంబరు10 ప్రభాతవార్త:** వినాయక నిమజ్జనానికి వెళ్లే నిర్వాహకులు పోలీస్ శాఖ వారి సూచనలు తప్పకుండా పాటించాలని జడ్చర్ల రూరల్ సిఐ నాగార్జునగౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు బాలానగర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వినాయక మండపాల నిర్వాహకులతో తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై తిరుపాజితో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనాలకు ఎలాంటి డిజెఅనుమతి లేదని,దీనికి అందరు సహకరించాలని ఆయా గ్రామాలకు చెందిన యువత మందుతాగి నిమజ్జనానికి వెళ్లకూడదని స్పష్టం చేశారు. వాట్సాప్ గ్రూప్‌లలోఎలాంటి అభ్యంతరకమైన పోస్టులు పెట్టవద్దని, బాలానగర్ మండలంలో ఎలాంటి గొడవలు లేకుండా నిమజ్జనం పండగలా చేయాలని ఈ సందర్భంగా సిఐ కోరారు.ఏవైనా గొడవలుజరిగే సందర్భం ఉంటే ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా తెలిపారు.

## విష జ్వరాలకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

**పెబ్బేరు సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని 5వ వార్డునందు డ్రైడే కార్యక్రమములో భాగంగా మాట్లాడుతూ దోమలు పెరగకుండా డ్రైడే గురించి పట్టణ ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఇంటిపరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి శుక్రవారం మంగళవారము రోజు ఇంటి ముందర ఇంటి పై కప్పున ఉన్న ప్లాస్టిక్ కంటైనర్స్ పగిలిపోయిన కుండలు పూల కుండీలు ఎయిర్ కూలర్లు సిమెంటు ట్యాంకులలో పాత టైర్లలో నీళ్లు నిలువకుండా చూసుకోవాలని వైద్య సిబ్బందికి పట్టణ ప్రజలకు తెలియజేశారు. పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ఆదిశేషు,ఎంఎల్‌హెచ్‌పి సుధారాణి, ఎఎన్ఎం మౌనిక, ఆశా కార్యకర్త నాగలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది బ్రీడింగ్‌చెక్కర్స్ అండ్ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది

■వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ఖిల్లాఘణపురం సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంది అని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ 44 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలోని పాఠశాలలు ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్నవిద్యార్థులకు యూనిఫామ్‌లను కట్టించి ఇచ్చే బాధ్యతను మహిళా సంఘాల వారికి అప్పగించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేమ వెంకటయ్య ,వెంకటేశ్వరరావు, సాయి చరణ్ రెడ్డి, ప్రకాష్ ,తహశీల్దార్ పాండునాయక్, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కానీ రైతులు తక్షణమే దరఖాస్తులు చేసుకోవాలి


వ్యవసాయ అధికారులతో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

**గోపాల్‌పేట సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండలం ఎదుట్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు పంట రుణమాఫీ కానీ రైతుల కుటుంబ మ్యాపింగ్ చేస్తుండగా మంగళవారం రోజు కలెక్టర్ పరిశీలించారు. అక్కడికి విచ్చేసిన రైతులతో మాట్లాడి రుణ మాఫీ కాకపోవడానికి ఉన్న ఇబ్బందులను పరిశీలించారు. వ్యవసాయ రుణమాఫీ జరగని రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న పొరపాట్లు జరిగి రుణమాఫీ జరగని రైతుల వివరాలు సరిచేశాక డబ్బులు జమ అవుతున్నాయని వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, గోపాల్ పేట తహశీల్దార్ తిలక్,తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఓటర్ లిస్ట్ ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

- మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్

**కల్వకుర్తి, సెప్టెంబర్10 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని బూత్ లెవల్ అధికారులు ఓటర్ లిస్ట్ ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ పిలుపునిచ్చారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలోని ప్రతి ఇంటింకి వెళ్లి ఓటర్‌జాబితాను వెరిఫికేసన్ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని,ఇట్టి పనిని సమయం వృధా చేయకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమంలో బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

## మిత్రుడు కుటుంబానికి మిత్రుల ఆర్థిక సాయం

**వంగూరు, సెప్టెంబర్10 ప్రభాతవార్త:** వంగూరు మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన బుడ్డ మహేష్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారంఉదయం మృతి చెందాడు. మహేష్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న తోటి మిత్రులు, డ్రైవర్స్ యూనియన్, ఆ గ్రామస్తులు మృతుడు కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచేందుకు రూ.92వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. వంగూరు మండల కేంద్రానికి చెందిన గెల్వలాంబ మాత యూత్ సభ్యులు రూ.5వేలు,హనుమాన్ యూత్‌సభ్యులు రూ.5వేలు, కాంగ్రెస్‌నాయకులు సలేశ్వరం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.స్నేహితులు,గ్రామస్తులుమానవత్వాన్ని చాటుకొని మృతుడు మహేష్‌కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటునందించి అండగా నిలిచారు.



## సెంట్రల్ బ్యాంకులో 2030 మంది రైతులకు రుణమాఫీ

◆ రుణమాఫీ రెన్యువల్ చేసుకున్న 1732 మంది రైతులు ◆ ఇటిక్యాల సెంట్రల్ బ్యాంకు సీనియర్ మేనేజర్ షఫీ ఉల్లా


మాట్లాడుతున్న ఇటిక్యాల సెంట్రల్ బ్యాంకు సీనియర్ మేనేజర్ షఫీ ఉల్లా

**ఇటిక్యాల సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ పరిధిలోగల రైతులకు ప్రభుత్వం అందించే రుణమాఫీ కోసం 3 వేల 7 వందల 70 మంది రైతలకు సంబంధించిన సమాచారం ప్రభుత్వానికి పంపగా అందులో 2 వేల 30 రైతులకు మూడు విడుదలగా ప్రభుత్వం మరదలు చేసిన రుణమాఫీలో 21 కోట్ల 62 లక్షల 39 వేల రూపాయలను రైతులు రైతుల రుణమాఫీని ప్రభుత్వం విడుదల చేసినట్లు ఇటిక్యాల సెంట్రల్ బ్యాంకు సీనియర్ మేనేజర్ ఎస్.ఎం.షఫీ ఉల్లా ప్రభాతవార్తకు తెలిపారు. సెంట్రల్ బ్యాంకులో రైతులకు 1 లక్షలోపు రైతులు 1524 మంది ఉండగా 11 కోట్ల 7 లక్షల లక్షన్నర లోపు రైతులు 1317 రైతులు ఉండగా 16 కోట్ల 59 లక్షలు 2లక్షల లోపు రైతులు 929 మంది ఉండగా 15 కోట్ల 38 లక్షల రుణమాఫీ కావడం జరిగిందన్నారు. అంతేకాక ప్రభుత్వం 3 విడుతలుగా రుణమాఫీ విడుదల చేయడంతో 1732 ముందు రైతులు రుణమాఫీ పొంది రెన్యువల్ చేసుకున్నట్లు ఇంకా 298 మంది రైతులు రెన్యువల్ చేసుకోవాల్సి ఉందన్నారు. 17 వందల 32 మంది రైతులు రెన్యువల్ చేసుకున్న రైతులకు 18 కోట్ల 82 లక్షల రూపాయలను రైతులకు చెల్లించినట్లు సెంట్రల్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఎస్.ఎం.షఫీ ఉల్లా తెలిపారు. రుణమాఫీ రైతులు రానివారు బ్యాంకుకు వచ్చి తెలుసుకుంటున్నారని అకౌంట్ లలో పట్టారాదు పాస్ పుస్తకంలో ఆధార్ కార్డులో పేర్లలో కొన్ని తప్పులు ఉండటంవల్ల అలాగే పిఎం కిసాన్ డాటా. ఉద్యోగుల డాటా వల్ల కూడా రైతులకు రుణమాఫీ పొందేందుకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. రుణమాఫీ కానీ రైతులకు ప్రభుత్వం ఆలోచించి ఆదేశాలు ఇస్తే వారికి పరిష్కారం జరుగుతుందన్నారు.

## మానసిక సమస్యలే ఆత్మహత్యకు కారణం

జిల్లా సీజనల్ ప్రోగ్రాం అధికారి డా. అల్లె శ్రీనివాసులు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సీజనల్ ప్రోగ్రాం అధికారి డా. అల్లె శ్రీనివాసులు

**లింగాల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** మానసిక సమస్యలే ఆత్మహత్యకు కారణాలవుతాయని జిల్లా సీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. అల్లె శ్రీనివాసులు అన్నారు. మంగళవారం లింగాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ, ఆశ్రమ పాఠశాల, కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతలో ఓర్పు సహనం నశించి విపరీతమైనమానసిక ఒత్తిడికి లోనవుతున్నారని అన్నారు.మార్కులు తక్కువ వచ్చా యని కొందరు ప్రేమించిన వ్యక్తి వల్ల మోసం అయిందని మరికొందరు మొబైల్ ఫోన్ మాయలో ఇంకొందరు ఇలా అనేక మంది మానసిక రుగ్మతకు లోనవుతున్నారని అన్నారు. సమస్యలేవైనా ఉన్నప్పుడు మంచి మిత్రుడు కుటుంబ సభ్యులతో చెప్పు కోవాలని దీంతో ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలో చనలు రావని అన్నారు.కార్యక్రమంలోలింగాల ప్రభుత్వ వైద్యాధికారి డా.శివశంకర్, కళాశాల ప్రిన్సి పల్ బాలస్వామి, కళాశాల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపితోనే మహిళలకు చేయూత

◆ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి


ఆన్‌లైన్ బిజెపి సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న లక్ష్మి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** బిజెపి పార్టీ అధికారంతోనే మహిళకు చేయూత ఉంటుందని మహిళా ముత్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిజెపితోనే మహిళా సాధికారత సాధ్యమని మహిళలు బిజెపిలో చేరి మరింత పటిష్టంగా నిలవాలని లక్ష్మీశ్యాంసుందర్ పిలుపునిచ్చారు. బిజెపి పార్టీ దేశంలో అధికారంలోకి వచ్చాక మహిళా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. బిజెపిలో చేరేందుకు అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తున్నదన్నారు. వికసిత భారత్ సాకారం కావాలంటే బిజెపి పటిష్టంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ బిజెపి సభ్యత్వంపొంది దేశానికి ప్రధాని నరేంద్రమోడీకి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని అన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు 30 శాతం బిజెపికి అండగా నిలబడ్డారని అన్నారు.రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బిజెపిని అధికారంలోకి తీసుకురావడం కోసం ముమ్మర సభ్యత్వం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మహిళామోర్చానాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## చక్రపాణిని వెంటనే సస్పెండ్ చేయాలి


దీక్షలో పాల్గొన్న దళిత నాయకులు

**కృష్ణ, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** గతనెల 18వ తేదీన ముడుమాల్ గ్రామంలోని దళితులను గుడిలోకి రానివ్వకుండా దళితుల పెళ్లిని అడ్డుకుని అవమాన పరిచిన పూజారి చక్రపాణిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి 20 రోజులు కావస్తున్నా ఇప్పటికి పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలు మంగళవారం నాటికి 6వ రోజుకు చేరాయి.దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ దళితులను గుళ్లోకి రానివ్వకుండా అవమానపరిచిన ఈ మనువాద పూజారి చక్రపాణిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామనిహెచ్చరించారు. కార్యక్రమంలో ముడుమాల్ దళిత న్యాయ పోరాట కమిటి నాయకులు అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ నియోజకవర్గ అధ్యక్షులు పృథ్వీరాజ్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు జీర్గల్‌నగేష్ మాదిగ, కెవిపిఎస్ కార్యదర్శి కృష్ణ, హిందూపూర్ అంబేద్కర్ సంఘం నాయకులు సుభాష్,కావలి నరసింహ,ఉజ్జెల్లి గణేష్, నారాయణ, అంబేద్కర్‌యువజన సంఘం కీలక సభ్యులు రవికుమార్, ముడుమాల్ గ్రామస్తులు గడ్డం సిద్ధప్ప, కృష్ణ,వెంటప్ప, తిమ్మన్న,ఓబ్లేష్, దేవేందర్, మహెందర్, అంజప్ప, గోపాల్, మహేష్, అశోక్ ఉన్నారు.